ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శనివారం 17 ఆగస్టు 2024

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ఆలయాలు



కాళేశ్వరంలో వరలక్ష్మీ వ్రత పూజలు చేస్తున్న మహిళలు

వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అలాగే ఆలయాల్లో సామూహికంగా వ్రతం ఆచరించారు. శ్రావణ మాసం పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలోని పలు ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. శ్రీ శుభానంద అమ్మవారి ఆలయం వద్ద శ్రీ త్రిపురారి కృష్ణమూర్తి, ప్రధాన అర్చకులు వారి ఆధ్వర్యంలో వేద రండితులు, అర్చక స్వాములతో సామూహిక వ్రతం, మంత్రోచ్చారణ నిర్వహించారు.

వివరాలు 8లో

స్వచ్ఛ సంకల్పం

పట్టణాల్లో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి నిర్ణయం



- 2026 నాటికి పెరిగే జనాభాను దృష్టిలో ఉంచుకుని చర్యలు
- ప్రతీ వెయ్యి జనాభాకు ఒక టాయిలెట్ సీటు
- స్థలాల ఎంపికకు అధికారుల కసరత్తు
- స్వచ్ఛభారత్-2 కింద కేంద్ర ప్రభుత్వ నిధులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.3.75కోట్లు మంజూరు

పట్టణ ప్రాంతాల్లో అధునాతన ప్రజామరుగుదొడ్లను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. స్వచ్ఛభారత్ మిషన్-1 కింద దేశవ్యాప్తంగా ఇప్పటికే ప్రజా మరుగుదొడ్లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు ఇచ్చిన కేంద్రం.. స్వచ్ఛభారత్ -2 కింద కూడా మరిన్ని నిధులు ఇవ్వడం ద్వారా ప్రజామరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రెండోదశలో రాష్ట్ర ప్రభుత్వానికి మొదటి విడతగా రూ. 34కోట్లను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా 50శాతం నిధుల కింద మరో రూ.17 కోట్లను సమకూరుస్తుంది. ఈ మొత్తంతో 1,357 టాయిలెట్ల సీట్లతో కూడిన మరుగుదొడ్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒక నగర పాలక సంస్థ, తొమ్మిది మున్సిపాలిటీలకు రూ.3.75కోట్లు మంజూరయ్యాయి.

హనుమకొండ, ఆగస్టు 16, (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు (పబ్లిక్ టాయిలెట్లు) చాలినన్ని లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు అవరసమైన మరుగుదొడ్లను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. పట్టణాల్లో ఏ ఏ స్థలాల్లో ప్రజా మరుగుదొడ్లు అవసరమో స్థలాను గుర్తించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దశాబ్దాల కిందట నిర్మించిన ప్రజా మరుగుదొడ్లలో చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని కూల్చేసి ఆ స్థానంలో లేదా మరే ఇతర అనువైన స్థలంలో వీటిని నిర్మించుకోవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. నిర్మాణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భరిస్తాయి.

గ్రామీణుల ఇబ్బందులు

గ్రామాల నుంచి పట్టణాలకు వివిధ పనులపై రోజుకు వేలాది మంది వస్తుంటారు. పాలు, కూరగాయలు అమ్ముకునేవారు, ఇతర చిరువ్యాపారులు, రైతులు తెల్లవారుజామునే గ్రామాల నుంచి బస్సుల్లో, రైళ్లలో బయటు దేరి పట్టణాలకు చేరుకుంటారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి పట్టణాల్లో ప్రస్తుతం పబ్లిక్ టాయిలెట్లు ఉన్నా.. అవి సరిపోవడం లేదు. రద్దీ ప్రాంతాల్లో ముఖ్యంగా రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ల సమీపంలో, కూరగాయల మార్కెట్లు, చౌరస్తా ప్రాంతాల్లో రద్దీ అధికంగా ఉండడంతో అత్యవసరమైనవారు పబ్లిక్ టాయిలెట్ల వద్ద వేచిచూడాల్సి వస్తోంది. పైగా ప్రస్తుతం ఉన్న పబ్లిక్ టాయిలెట్లలో ఎక్కువ భాగం ఎనిమిది కన్నా తక్కువ సీట్లు ఉన్నవే. కొన్నిట్లో ఐదు మాత్రమే ఉన్నాయి.

పెరిగే జనాభా మేరకు..

స్వచ్ఛ భారత్ మార్గదర్శకాల ప్రకారం మున్సిపాలిటీలో ప్రతీ వెయ్యి జనాభాకు ఒక సీటు చొప్పున ప్రజామరుగుదొడ్లను నిర్మించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టణాల్లో ప్రజామరుగు దొడ్లు ఉన్నా- ప్రజలకు సరిపడా అందుబాటులో లేవు. పట్టణాలకు సమీప గ్రామీణ ప్రాంతాల నుంచి వేలాది మంది వివిధపనుల నిమిత్తం వస్తుంటారు. వారంతా అత్యవసర సమయంలో ప్రజా మరుగుదొడ్లనే వినియోగించాల్సిన పరిస్థితి. ప్రస్తుతం జారీ చేసిన ఉత్తర్వుల్లో 2026 సంవత్సరం నాటికి పెరిగే పట్టణ జనాభాను అంచనా వేసింది. దాంతోపాటు గ్రామాల నుంచి రోజు పట్టణాలకు వచ్చి పోయే వారిని పట్టణ జనాభాలో 5శాతంతో లెక్కించి కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయితే నిర్వహణలో ఉన్న మరుగుదొడ్లలో పరిశుభ్రత లోపిస్తోందనే ఆరోపణలున్నాయి. డబ్బులు చెల్లించి వినియోగించే (పే అండ్ యూజ్) మరుగుదొడ్ల నిర్వాహకులు రెట్టింపు వసూలు చేస్తున్నా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

స్థలాల ఎంపికకు కసరత్తు

పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి స్థలాల ఎంపికే పెద్ద సవాల్‌గా నిలుస్తోంది. రద్దీ కూడళ్లలో అనువైన స్థలాలు దొరకడం లేదు. ఒక వేళ దొరికినా చుట్టు పక్కల వారు అభ్యంతరం పెడుతున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్-2 మార్గదర్శకాల ప్రకారం అత్యవసరంగా మరుగుదొడ్డికి వెళ్లాలనుకునేవారికి 2 నిమిషాల్లో మరుగుదొడ్డి వద్దకు చేరుకునేలా నిర్మించాల్సి ఉంటుంది. అది స్థలాల కొరత వల్ల సాధ్యం కావడం లేదు. ప్రధాన రహదారికి ఆనుకొని వీటిని నిర్మించే క్రమంలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో దూరంగా స్థలం దొరికిన చోట నిర్మిస్తున్నారు. దీంతో వాటిని ప్రజలు ఉపయోగించుకోలేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. పబ్లిక్‌గార్డెన్, కూరగాయల మార్కెట్ తదితర నిత్యం రద్దీ ఉండే ప్రాంతాల్లో ఉన్న ప్రజా మరుగుదొడ్లకు తాకిడీ ఎక్కువగా ఉంటోంది. అయితే ఇక్కడ మరుగుదొడ్ల నిర్వాహకులు వాటిని పరిశుభ్రంగా ఉంచకపోవడంతో అక్కడికి వెళ్లడానికి ప్రజలు పెద్దగా ఇష్టపడడం లేదు. ఈ పరిస్థితుల్లో స్వచ్ఛ భారత్ మిషన్-2 కింద మరుగుదొడ్ల నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఆ మేరకు వాటిని నిర్మించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

జనాభా - మరుగుదొడ్లు

వరంగల్ మహానగర పాలక సంస్థ మొత్తం జనాభా 11 లక్షలు. వివిధ పనులపై బయట నుంచి వచ్చేవారు 5 శాతం. అంటే 55వేల మందిని కూడా కలుపుకుంటే 11.55 లక్షలకు చేరుకుంటుంది. ఈ లెక్కన గ్రేటర్ మున్సిపాలిటీ పరిధిలో ఒక్కో పబ్లిక్ టాయిలెట్‌ను 12 సీట్లతో నిర్మిస్తారు. మిగతా మున్సిపాలిటీలైన జనగామ జనాభా బయటి నుంచి వచ్చే పోయే 5 శాతం మందిని కలుపుకుంటే మొత్తం జనాభా 77వేలు, మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో బయటి నుంచి వచ్చే 5 శాతం కలుపుకొని మొత్తం జనాభా 60,900,



నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం జనాభా బయటి నుంచి వచ్చే 5శాతం కలుపుకుంటే 42వేలు, తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం జనాభా బయటి నుంచి వచ్చే 5 శాతం కలుపుకుంటే 27,500. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం జనాభా బయటి నుంచి వచ్చే 5 శాతం మందిని కూడా కలుపుకుంటే 36,750, మరిపెడ మున్సిపాలిటీ మొత్తం జనాభా 5శాతం కలుపుకుంటే 24,150. డోర్నకల్ బల్దియా మొత్తం జనాభా 5 శాతం కలుపుకుంటే 21వేలు, వర్ధన్నపేట మున్సిపాలిటీ మొత్తం జనాభా 5శాతంతో కలుపుకొని 15,750. వీటిల్లో 8 సీట్లతో కూడిన ప్రజా మరుగుదొడ్లను నిర్మిస్తారు. ఒక్కోదానిపై రూ.20లక్షలను వెచ్చిస్తారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా రూ.10లక్షలను సమకూరుస్తుంది.

పర్యాటకంగా పాండవుల గుట్టల అభివృద్ధి

20న మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పాండవుల గుహలో రాతి చిత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్

రేగొండ, ఆగస్టు 16: పర్యాటకంగా పాండవుల గుట్టలను రాష్ట్రంలోనే గుర్తింపు లభించేలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని రావులపల్లి గ్రామ శివారులో గల పాండవుల గుట్టలను ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్‌శర్మలు శుక్రవారం సందర్శించారు. ఈ నెల 20న మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ పాండవుల గుట్టలకు వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గుట్ట పైకి ఎక్కి పాండవుల గుహ, రాతి చిత్రాలు, రాతి ఆనవాళ్లు పరిశీలించారు. అలాగే పాండవుల గుట్టల చరిత్రను అడిగి తెలుసుకున్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు రానున్నారని పాండవుల గుట్టలు, బుగులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కోటగుళ్ళు, గణపురం చెరువు కట్టపై గెస్ట్ హౌస్‌ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరనున్నట్లు తెలిపారు. పాండవుల గుట్టలో ఎలాంటి పనులు చేయాలో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టరు వెంకటేశ్వర్లు, డీఎస్పీ సంపత్‌రావు, ఎఫ్ఆర్ఓ నరేష్, తహసీల్దార్ శ్వేతారావు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సంపత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కోటంచ చైర్మన్ భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు ఉమేష్‌గౌడ్, పున్నం రవి, ఏనుగు రవిందర్‌రెడ్డి, మేకల భిక్షపతి, కొలెపాక సాంబయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల

అప్రమత్తంగా ఉండాలి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్



పోచాపూర్ కంటైనర్ ఆస్పత్రిని పరిశీలిస్తున్న హెల్త్ అదనపు డైరెక్టర్

ములుగు, ఆగస్టు 16: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన వారికి రోగనిర్ధారణ చేసి మెరుగైన వైద్యం అందించాలని వైద్యఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన ములుగు జిల్లాలో పర్యటించారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలను సందర్శించిన ఆయన ఫీవర్ వార్డులో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మోహన్ లాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, ఆర్ఎంవో ప్రవీణ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో అప్పయ్యతో సమావేశమయ్యారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌ను ప్రాథమికంగా నిర్ధారించి సరైన సమయంలో రోగులకు వైద్యం అందించాలని సూచించారు. గోవిందరావుపేట మండలం పస్రా, తాడ్వాయి మండలం కొడిశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను తనిఖీ చేసిన ఆయన వైద్యులకు సూచనలు చేశారు. దోమతెరల ఆవశ్యతకు తెలుపుతూ కొడిశాల పీహెచ్‌సీలో బొమ్మలతో చేస్తున్న ప్రదర్శనను అన్ని పీహెచ్‌సీలలో ఏర్పాటు చేయాలని సూచించారు. పోచాపూర్‌లోని కంటేనర్ ఆస్పత్రిని తనిఖీచేసిన డాక్టర్ అమర్‌సింగ్ ఆసమయంలో చికిత్స పొందుతున్న ఇరువురు మహిళలతో మాట్లాడారు. మారుమూల గ్రామంలో ప్రయోగాత్మకంగా కంటేనర్ ఆస్పత్రిని ఏర్పాటుచేసి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడంపట్ల హర్షం వ్యక్తంచేశారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో అప్పయ్యతో పాటు జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ నాగయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారులు పవన్, మధు, ఇన్‌చార్జి మలేరియా అధికారి దుర్గారావు ఉన్నారు.

లాభాల్లో వాటా 45శాతం ఇవ్వాలి

- టీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య

కాకతీయఖని, ఆగస్టు 16: 2022-23 వార్షిక ఆదాయం నుంచి వచ్చిన లాభాలను సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా 45 శాతం ఇవ్వాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య అన్నారు.బాతాల రాజు భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గట్టయ్య మాట్లాడారు. సింగరేణి ఎన్నికలకు ముందు కార్మికుల ప్రయోజనాలే తమ ఎజెండా అని మేనిఫెస్టోలో పెట్టిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు అధికారంలోకి వచ్చాక ఎనిమిది నెలలు గడిచినా.. ఇప్పటివరకు ఇచ్చిన హామీలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సింగరేణి యాజమాన్యంతో కుమ్మక్కై వారి ఆర్థిక ప్రయోజనాలే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. లాభాల్లో వాటా, సొంతింటి కల, పెర్క్స్ మీది ఇన్‌కంటాక్స్ వాపసు, తదితర అంశాలను వెంటనే అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సింగరేణికి రావాల్సిన రూ.3వేల కోట్ల బకాయిలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికే ఇవ్వాలని అన్నారు. రిటైర్డ్ అయిన కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ప్రకారం పెన్షన్, గ్రాట్యూటీ పెంచి ఇవ్వాలని అన్నారు. గుర్తింపు కాల పరిమితి పత్రం రెండు సంవత్సరాలకే పరిమితం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 190 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నీరటి రాజన్న, జైపాల్‌రెడ్డి, దాసరి జనార్దన్, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్, లింగయ్య, మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సంబురం!

త్వరలో వరంగల్‌లో రైతు సభ నిర్వహణకు యోచన

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఖర్గేకు సీఎం ఆహ్వానం

రైతు డిక్లరేషన్‌ను ప్రకటించిన ఆర్ట్స్ కాలేజి మైదానంలో ఏర్పాట్లకు కసరత్తు

మూడువిడతల్లో 2.65లక్షల రైతుల ఖాతాల్లో రూ.2,242కోట్లు జమ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఎన్నికల హామీగా రైతు రుణమాఫీపై ప్రకటన చేసిన కాంగ్రెస్.. ఇచ్చిన మాట ప్రకారం మూడు విడతల్లో రూ.2లక్షల రుణమాఫీని పూర్తి చేసిన విషయం తెలిసిందే. దీంతో రైతులు రుణమాఫీ సంబురంలో మునిగిన క్రమంలో త్వరలోనే రైతు కృతజ్ఞత సభను నిర్వహించాలని కాంగ్రెస్ యోచిస్తోంది. అయితే 2022 మే 6వ తేదీన వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభ నిర్వహించిన వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలోనే ఈ రైతు కృతజ్ఞత సభను కూడా నిర్వహించాలని భావిస్తోంది. నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి గత జూలై నెలాఖరునే వరంగల్‌లో సభ నిర్వహించాలని భావించినా.. పార్లమెంట్ సమావేశాలుండటంతో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే సభకు రావడానికి వీలు పడలేదు. ఈ క్రమంలోనే శుక్రవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేసిన నేపథ్యంలో వరంగల్‌లో నిర్వహించబోయే భారీ రైతు సభకు రావాల్సిందిగా రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఖర్గేలను ఆహ్వానించినట్లు సమాచారం. వారి నుంచి సానుకూల స్పందన రావడంతో 24న లేదంటే 25న వరంగల్‌లో రైతు కృతజ్ఞత సభ నిర్వహణ ఖాయమేనని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సుమారు ఐదు లక్షల మంది రైతులతో కృతజ్ఞత సభ నిర్వహించే లక్ష్యంతో కసరత్తు చేస్తోంది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ నుంచి తిరిగి రాగానే వరంగల్‌లో సభ నిర్వహణపై దృష్టి పెట్టనున్నారని, ఒక వేళ ఆ రోజు కుదరకపోతే నెలఖారులోపు కచ్చింతంగా సభ ఉండి తీరుతుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.



రుణమాఫీ.. రైతు హ్యాపీ..

ఇచ్చిన హామీ మేరకు 27 రోజుల్లో మూడు విడతల్లో రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూలై 18న తొలి విడత మాఫీని అమలు చేయగా.. మొదటి రెండు విడతల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,08,077 మంది రైతుల ఖాతాలో రూ.1,506.50కోట్ల మాఫీ డబ్బులను ప్రభుత్వం జమ చేసింది. ఇక మూడో విడతలో రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల లోపు రుణమాఫీ ఉన్న 56,704 మంది రైతుల ఖాతాలో రూ.735.29కోట్లను జమ చేసింది. మొత్తం మూడు దశల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,64,781మంది రైతులకు రూ.2,241.79కోట్ల రుణమాఫీని చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కూడా పూర్తికాకముందే రైతులకు రూ.2లక్షల రుణమాఫీపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంపట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ కాకపోవటతో ఆందోళనలో ఉండగా.. అలాంటి వారి నుంచి కలెక్టరేట్లలోనే హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తుండటం కొంత ఊరటనిస్తోంది. త్వరలోనే ఆ సాంకేతిక సమస్యలను అధిగమించి ఈ నెలాఖరు కల్లా పూర్తి ప్రక్రియను పూర్తిచేస్తామని ఇటీవల భూపాలపల్లి జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడం, ఆమేరకు అధికారులు కూడా కరసత్తు ప్రారంభించడంతో మాఫీ వర్తించని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పిల్లల ఎదుగుదలను పక్కాగా పర్యవేక్షించాలి

- అంగన్‌వాడీల్లో గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ దివాకర



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 16: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల ఎదుగుదలను పక్కాగా పర్యవేక్షించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ పనితీరుపై ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదల పర్యవేక్షణలో అవసరమైతే సిబ్బందికి శిక్షణ అందించాలని, బరువు తక్కువగా ఉన్న పిల్లలు, ఎదుగుదల లేని పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అదనపు పౌష్టికాహారం అందించాలని సూచించారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలకు బాలామృతం, పోషకాహారం అందించాలని, పిల్లల ఎదుగుదలను రెగ్యులర్‌గా మానిటర్ చేయాని, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ విద్యాకేంద్రాలుగా(ప్రీస్కూల్) ప్రభుత్వం తీర్చిదిద్దిందని, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు ప్రీ స్కూల్ పాఠ్యాంశాలు, సిలబస్ తూచా తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించిన కరదీపిక, ప్రియదర్శిని ప్రకారం పిల్లలకు పాఠ్యాంశాల సిలబస్ బోధన జరగాలన్నారు. ప్రీస్కూల్ నిర్వహణను సూపర్‌వైజర్లు నిరంతర తనిఖీలతో పర్యవేక్షించాలని, అంగన్‌వాడీ టీచర్లకు అవసరమైన శిక్షణ, సలహాలు ఎప్పటికప్పుడు అందించాలని, పిల్లలకు వినూత్న పద్ధతులతో పాఠ్యాంశాలు బోధించే అంశంలో టీచర్లచే అవసరమైన యాక్టివిటీస్ చేయించాలని సూచించారు. అదేవిధంగా గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, వారు రెగ్యులర్‌గా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి పౌష్టికాహారం తీసుకుంటున్నారా లేదా అనే అంశాన్ని సూపర్‌వైజర్ పర్యవేక్షించాలని అన్నారు. గర్భిణులు రాని పక్షంలో దానికి గల కారణాలు తెలుసుకుంటూ వారిని ఫాలోఅప్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనిన, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వాగులు .. వంకలు దాటి..

ఐలాపూర్ పర్యటనకు అదనపు కలెక్టర్

కన్నాయిగూడెం, ఆగష్టు 16:ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని అటవీ గ్రామం ఐలాపూర్‌లో శుక్రవారం ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజ పర్యటించారు. మండలంలోని సర్వాయి వరకు తన వాహనంలో వెళ్లిన శ్రీజ ఐలాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అటవీ మార్గం గుండా ద్విచక్రవాహనం ద్వారా ప్రయాణం చేశారు. మార్గ మధ్యలో వాగులు , రోడ్డు బురద, గుంటలు ఉన్న చోట కాలినడకన ప్రయాణం చేసి గ్రామంలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వర్షాకాలం వస్తే రోడ్డు మొత్తం బురద మయంగా మారి రవాణా కష్టాలు ఎదుర్కుంటున్నామని గ్రామస్థులు తెలిపారు. రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరై పనులు ప్రారంభించగా ఫారెస్టు అధికారులు పనులను అడ్డుకొని నిలిపి వేశారని విన్నవించారు. పంచాయతీ కార్యదర్శులు విద్యాసాగర్, అనిల్ తదితరులు ఉన్నారు.



గ్రామస్థులతో మాటాడుతున్న శ్రీజ

గోదావరిలో భక్తుల

పుణ్య స్నానాలు..



గోదావరిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహదేవపూర్, ఆగస్టు 16 : కాళేశ్వరంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. త్రివేణి సంగమ తీరంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మంచిర్యాల, హైదరాబాద్, తెలంగాణలోని పలు ప్రాంతాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొంతమంది భక్తులు పితృదేవతలను గుర్తు చేస్తూ పూజా క్రతువును చేయించుకున్నారు.

అసిస్టెంట్, సబ్ ఇంజనీర్లపై సస్పెన్షన్ వేటు

హనుమకొండ టౌన్, ఆగస్టు 16: వరంగల్ సర్కిల్ పరిధిలోని ఏజే మిల్స్ ఏఈ ఎం.జ్యోతిర్మయినాథ్, గొర్రెకుంట సబ్‌ఇంజనీర్ డి.నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్‌ఈ పి.మధుసూదన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్ అంతరాయంపై ఓ వినియోగదారుడు ఏఈ జ్యోతిర్మయినాథ్‌కు ఫోన్ చేసి విద్యుత్ సరఫరాను ఎప్పుడు పునరుద్ధరిస్తారని అడగగా, ఏఈ దూషించాడు. అలాగే సబ్ ఇంజనీర్ నరేశ్ కూడా దూషించడంతో ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీంతో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఇద్దరిపై వేటు వేసింది.

ప్రైవేటు ఆస్పత్రుల్లో విజిలెన్స్ దాడులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 16: నగరంలోని రెండు ప్రయివేటు ఆస్పత్రుల్లో విజిలెన్స్ విభాగం దాడులు నిర్వహించింది. శుక్రవారం వరంగల్‌లోని సురక్ష ఆస్పత్రి, హనుమకొండలోని ముత్య కిడ్నీ సెంటర్లపై దాడులు చేశారు. ఆరోగ్యశ్రీ అర్హత ఉన్నప్పటికీ రోగుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో దాడులు చేశారు. మరో రెండు ఆస్పత్రులపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ రాజకీయ ఒత్తిడులతో దాడులు తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. ఆరోగ్యశ్రీలో అన్ని అర్హతలున్నప్పటికీ రోగుల వద్ద అదనంగా డబ్బులు వసూలు చేస్తూ రశీదులు కూడా ఇవ్వడం లేదని ఆరోగ్యశ్రీ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు అందాయి. దీంతో ఈ ఆస్పత్రులపై అధికారులు దాడి చేసినట్లు తెలిసింది.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

హనుమకొండ టౌన్, ఆగస్టు 16: ద్విచక్రవాహనాల దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు హనుమకొండ సీఐ వై.సతీష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శుక్రవారం హనుమకొండ చౌరస్తాలోని కాకాజీకాలనీలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు నెలల కిందట హనుమకొండ బస్టాండ్‌లో చోరీకి గురైన హోండా షైన్ వాహనంతో జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం మల్లక్కపల్లికి చెందిన రంగు గంగాధర్ పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకొని విచారించగా హైద్రాబాద్‌లోని అమీర్‌పేట, యాదగిరిగుట్ట, స్టేషన్‌ఘన్‌పూర్, చేర్యాలలో కలిపి 5 బైకులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దొంగిలించిన బైకులు గుంటూరువాసి అయిన సుభాన్‌కు అమ్మినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి బైకును స్వాధీనం చేసుకొని కోర్టులో హజరుపరచామన్నారు.

వివాహిత అదృశ్యం



జోగు జ్యోతి (ఫైల్)

వేలేరు, ఆగస్టు 16: వేలేరు మండల కేంద్రానికి చెందిన జోగు జ్యోతి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వేలేరుకు చెందిన జ్యోతి భర్త 9 నెలల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె దిగాలుగా ఉంటూ మనో వేదనకు గురైంది. ఈ క్రమంలో ఈ నెల 11న ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబసభ్యులు తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో జ్యోతి రెండో కుమార్తె అర్చన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. జ్యోతి 5.2 అంగుళాల ఎత్తు, ఛామన ఛాయ రంగు కలిగి ఉంటుంది. ఎర్ర చీర, నలుపు బ్లౌజు ధరించి ఉంది. ఆచూకీ తెలిసిన వారు వేలేరు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

డాక్టర్ పల్లెపాడు దామోదర్‌కు సన్మానం



అవార్డు అందుకుంటున్న పల్లెపాడు దామోదర్

కాళోజీ జంక్షన్, ఆగస్టు 16: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నందుకు దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్‌ను కన్స్యూమర్ కో ఆర్డినేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జాతీయ చైర్మన్ అనంతశర్మ, జాతీయ కన్వెన్షన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈనెల 16, 17 తేదీల్లో గుజరాత్ రాష్ట్రంలోని అంబాజీలో జరుగుతున్న సీసీఐ జాతీయ కన్వెన్షన్‌లో పల్లెపాడు దామోదర్ దక్షిణాది రాష్ట్రాల తరఫున ప్రాతినిధ్యం వహించి పాల్గొన్నారు. దామోదర్ మూడు దశాబ్దాలుగా వినియోగదారులను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై, బంగారం కొనుగోలులో హాల్ మార్క్, బీఐఎస్ ప్రాముఖ్యతపై రియల్ ఎస్టేట్, రెగ్యులేటరీ యాక్ట్‌పై ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతిపాండే, ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్, వినియోగదారుల జాతీయ కన్వెన్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వినియోగదారుల కేంద్ర కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చక్రపాణి



హనుమకొండ(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల కేంద్రకమిటీకి సాంబరాజు చక్రపాణి రెండోసారి వరుసగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. గుజరాజ్ రాష్ట్రంలోని అంబాజీలో రెండు రోజులుగా వినియోగదారుల జాతీయ సమావేశాలు జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన ముగింపు సమావేశంలో వినియోగదారుల కేంద్ర కమిటీకి ఎన్నికలు జరగగా, తెలంగాణ నుంచి చక్రపాణి ఎన్నికయ్యారు. కాగా, పల్లె దామోదర్ సీనియర్ సెక్రెటరీగా, అన్నప్రగడ శివపార్వతి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వినియోగదారుల కేంద్ర కమిటీకి నూతన అధ్యక్షురాడిగా గుజరాత్‌కు చెందిన పాండ్య ఎన్నికయ్యారు. అన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ డాక్టర్ అనంత శర్మ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చక్రపాణి మూడు దశాబ్దాలుగా వినియోగదారుల ఉద్యమంలో కొనసాగుతున్నారు. రాష్ట్ర వినియోగదారుల మండలి అధ్యక్షుడిగా కూడా ఉన్నారు.

సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లకు సత్కారం



సివిల్స్ ర్యాంకర్లను సన్మానిస్తున్న వాగ్దేవి సంస్థల అధినేత దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 16: యూపీఎస్సీ-2023లో ర్యాంకులు సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురికి శుక్రవారం కిషన్‌పురలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో సత్కరించారు. దీక్ష ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 'గురువందనం' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఏపీ మాజీ సీఎస్ ఉమామహేశ్వర్‌రావు, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ వీఎస్ సంపత్ హాజరై పరిపాలనలో సివిల్ సర్వెంట్స్‌కు ఎదురయ్యే సమస్యలను తమ అనుభవాల ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో ర్యాంకర్లు అనూష కొల్లి, భార్గవ్ కుమార్, కిరణ్ సాయింపు, లవకుమార్, వాగ్దేవి విద్యాసంస్థల అధినేత డాక్టర్ సీహెచ్. దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగమ్యగోచరంగా వర్సిటీ పీజీ కళాశాలలు

- ఏటేటా తగ్గుతున్న అడ్మిషన్లు
- అభివృద్ధిని పట్టించుకోని వర్సిటీ అధికారులు
- మూసివేతలో జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి కళాశాలలు



కేయూక్యాంపస్, ఆగస్టు 16: కాకతీయ యూనివర్సిటీపరిధిలోని వర్సిటీ పీజీ కళాశాలల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఎంతో ఉదాత్తమైన ఆలోచనలతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే గొప్ప లక్ష్యంతో స్థాపించిన కళాశాలలు నీరుగారిపోతున్నాయి. వర్సిటీ ఉన్నతాధికారులు నిర్లక్ష్య ధోరణి, స్థానిక ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంలో వర్సిటీ పీజీ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సరైన అధ్యాపకుల్లేక పాఠాలు సరిగ్గా జరుగక విద్యార్థులు పీజీ కళాశాల్లో అడ్మిషన్లు పొందేందుకు వెనకడుగు వేస్తున్నారు. విద్యార్థుల అడ్మిషన్లు లేవని వర్సిటీ అధికారులు పీజీ కళాశాలల్లో అధ్యాపకులను నియమించడం లేదు. దీంతో ఏటేటా పీజీ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య దారుణంగా పడిపోతోంది.

ఏటేటా తగ్గుతున్న అడ్మిషన్లు

గతంలో వర్సిటీ పరిధిలో జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లిలో వర్సిటీ పీజీ కళాశాలలు ఏర్పాటు చేశారు. జనగామలో ఎంఏ ఇంగ్లీష్, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, మహబూబాబాద్‌లో ఎంఏ తెలుగు, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఏ ఎకానమిక్స్ కోర్సులను ప్రారంభించారు. అలాగే భూపాలపల్లిలో ఎంఏ ఇంగ్లీష్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. కోర్సులను ప్రారంభించిన వర్సిటీ అధికారులు.. శాశ్వత భవనాలపై దృష్టి సారించకుండా అక్కడి డిగ్రీ కళాశాలల్లోనే కోర్సులను నడిపిస్తున్నారు. సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులకు కూర్చునేందుకు అవకాశం లేక తరగతులు సక్రమంగా నడువడం లేదు. తరగతులు సక్రమంగా నడువకపోవడంతో విద్యార్థులు క్లాస్‌లకు హాజరుకావడం లేదు. సరైన అధ్యాపకులను నియమించకపోవడంతో పాఠాలు సక్రమంగా జరగక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అడ్మిషన్లపై తీవ్ర ప్రభావం పడుతోంది. క్లాస్‌లు సక్రమంగా జరుగక, సరైన వసతుల్లేక జనగామ పీజీ సెంటర్‌లోని ఎంఎస్సీ కెమిస్ట్రీ కోర్సును రద్దు చేశారు. దీంతో కెమిస్ట్రీ కోర్సును అభ్యసించే జనగామ విద్యార్థులు హనుమకొండకు రావాల్సి వస్తోంది.

స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్య వైఖరి

జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ పీజీ కళాశాలల అభివృద్ధికి విద్యార్థులు ఎంతగానో పోరాటాలు చేశారు. విద్యార్థి సంఘాల నేతృత్వంలో స్థానిక ఎమ్మెల్యేలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులను కలిసి పీజీ కళాశాలలకు భూమి కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలని వినతిపత్రాలు అందచేశారు. జనగామ, మహబూబాబాద్‌లో భూ కేటాయింపునకు సంబంధించిన పనులు జరిగిన శాశ్వత భవనాల మాట ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. భూపాలపల్లిలో పీజీ కళాశాలకు భూకేటాయింపు జరగలేదు. కళాశాలకు భూమిని కేటాయించి, శాశ్వత భవనాలు నిర్మిస్తే అక్కడి విద్యార్థులకు పీజీ కోర్సులు చదువుకునే అవకాశం కలుగుతోంది. లేకపోతే రానున్న రోజుల్లో వర్సిటీ పీజీ కళాశాలలు కనుమరుగయ్యే దుస్థితి నెలకొంది.

వర్సిటీ అధికారుల విచిత్ర ధోరణి

పీజీ కళాశాలల మనుగడను దెబ్బతీసేందుకు వర్సిటీ అధికారులు విచిత్ర వైఖరిని అవలంబిస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి పీజీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన కొద్దిమంది విద్యార్థులను వర్సిటీ క్యాంపస్‌తో పాటు సుబేదారిలోని పీజీ కళాశాలకు మారుస్తున్నారు. పీజీ సెంటర్లలో ఒక్కో కోర్సులో తగినన్ని అడ్మిషన్లు లేవనే సాకుతో అడ్మిషన్లు పొందిన ఆ కొద్దిమంది విద్యార్థులను అక్రమంగా తమ అడ్మిషన్ పొందిన కళాశాల కాకుండా మరో కళాశాలకు మారుస్తుండంతో పీజీ కళాశాలల లక్ష్యం నీరుగారిపోతోంది. ఆయా పీజీ సెంటర్లలో జాయిన్ అయిన విద్యార్థులు మరో కళాశాలకు మార్చినా అక్కడే అడ్మిషన్‌తోనే పరీక్షలకు అనుమతిస్తున్నారు. అడ్మిషన్ ఒక పీజీ కళాశాలలో చదువు మరో కళాశాలలో నడుస్తుండంతో విద్యార్థులు ఏమీ పాలుపోవడం లేదు.

పీజీ కళాశాల మనుగడపై నీలినీడలు

కర్ణుడి చావుకు సవాలక్ష కారణలనే విధంగా.. పీజీ కళాశాలల్లో అడ్మిషన్లు లేవని, తరగతులు జరగడం లేదనే సాకుతో కళాశాల మూసివేతకు వర్సిటీ అధికారులు. రంగం సిద్ధం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఎస్‌ఎఫ్‌సీ కోర్సులైన పీజీ సెంటర్లలో జీతాలకు సరిపోయే నిధుల్లేక అధ్యాపకులను నియమించకపోవడంతో తరగతులు జరుగడం లేదు. దీంతో విద్యార్థులు కళాశాలకు రావడం లేదు. ఫలితంగా అసలు పీజీ కళాశాల మనుగడపై నీలినీడలు కమ్ముకున్నాయి. పీజీ కళాశాలలు మూసివేస్తే పేద, దళిత, మధ్య తరగతి వర్గాలకు ఉన్నత విద్య అందని దాక్షలాగే మారుతోంది. పీజీ కళాశాలలకు పర్యవేక్షణ బాధ్యతలను ఇన్‌చార్జులకు అప్పగించారు. దీంతో పీజీ కళాశాలలపై పర్యవేక్షణ కొరవడింది. దొందూ దొందే.. అనే ధోరణిలో పీజీ కళాశాల సిబ్బంది, ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు, తాత్కాలిక అధ్యాపకులు వ్యవరిస్తున్నారు.

పాడైపోతున్న నిర్మల్ పీజీ కళాశాల భవనం

ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్ పీజీ కళాశాల ఎందుకు పనికి రాకుండా పోతోంది. నిర్మల్ పీజీ కళాశాలకు శాశ్వత భవనంతో పాటు ఫర్నిచర్ ఇతర సదుపాయాలుప్పటికీ వర్సిటీ అధికారులు నిర్లక్ష్య వైఖరిలో అక్కడ అడ్మిషన్లు లేవు, క్లాస్‌లు జరగడం లేదు. కళాశాలలోని ఫర్నిచర్‌తో పాటు వర్సిటీకి చెందిన భవనం దెబ్బతింటోంది. వర్సిటీ నిధులు రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన భవనం ఎందుకు పనికి రాకుండా పాడైపోతోంది. నిర్మల్ కళాశాలలో ఈ ఏడాదైనా విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి విద్యను అందిస్తే బాగుంటుందని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

ఉపాధి కార్యాలయంలో 20న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 16: ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐలోని వరంగల్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి సీహెచ్. ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని రిలయన్స్ నిప్పోన్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ కంపెనీ లిమిటెడ్‌లో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆమె తెలిపారు. 35 నుంచి 40 ఏళ్ల పట్టభద్రులైన వివాహితులు మాత్రమే జాబ్‌మేళాలో పాల్గొనాలని ఆమె సూచించారు. ఎంపికైన అభ్యర్థులు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు వేతనంతో పాటు అదనంగా పీఎఫ్, హెల్త్ ఇన్సూరెన్స్‌ను అందజేస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు మంగళవారం ఉదయం 11 గంటలకు ములుగురోడ్‌లోని ఉపాధి కార్యాలయంలో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 9573885532 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

డైట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 16: హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డైట్ ప్రిన్సిపాల్ డి. వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ మీడియంలో ఫిలాసఫీ, ఉర్దూ లాంగ్వేజ్, సైన్స్ పెడగాగికి ఒక్కో పోస్టు మొత్తం 3, తెలుగు/ఇంగ్లీష్ మీడియంలో సైన్స్ పెడగాగి ఒక్క పోస్టు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 21లోగా డైట్ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

పోలీసుల అదుపులో ఇద్దరు దళారులు

నర్సంపేట టౌన్, ఆగస్టు 16: నర్సంపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలిప్పిస్తామని అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఓ దళారి ముఠాలోని ఇద్దరిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నా రు. ఇటీవల ప్రభుత్వం కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో 180 పోస్టుల భర్తీ కోసం నవోదయ ఏజెన్సీకి అప్పగించారు. పోస్టుల భర్తీలో అవకతవకలకు పాల్పడుతున్నారని అభ్యర్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ పోస్టుల భర్తీని పారదర్శకంగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు. హన్మకొండ జిల్లా పరకాల, నర్సంపేట మండలంలోని ఆకులతండాకు చెందిన కొందరు దళారులు ముఠాగా ఏర్పడి ఉద్యోగాలిప్పిస్తామంటూ అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. దాంతో అభ్యర్థులు విషయాన్ని పోలీసులకు చేరవేశారు. పోలీసులు వలపన్ని ఇద్దరు వ్యక్తులను పట్టుకోగా మరో మహిళ పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను అడుగగా అదుపులోకి తీసుకున్న విషయం వాస్తవమేనని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన విద్యాశాఖ సిబ్బంది


ఎమ్మెల్సీ కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యాశాఖ సిబ్బంది

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 16: ఎమ్మెల్సీ ఎన్నికైన కోదండరామ్‌ను ఉమ్మడి జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కోదండరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ విద్యాశాఖలో పనిచేసున్న సీనియర్ అసిస్టెంటు ఎం.డి. ఫకృద్దీన్, ఆర్జేడీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.డి. ఉస్మాన్ పాషా, జూనియర్ అసిస్టెంట్ ఆర్.అశోక్, జనగామ డీఈవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.పవన్‌కుమార్, ములుగు డీఈవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ టి.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆహా.. ఏమి రుచి!

కూల్‌డ్రింక్స్ తాగుతున్న కోతులు


గుంజేడులో కూల్‌డ్రింక్స్ తాగుతున్న కోతులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 16 : మనుషులేనా కూల్‌డ్రింక్స్ తాగేది.. మేము సేవిస్తాం!! అంటూ కోతులు సవాల్ విసురుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుంజేడు శ్రీముసలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు వస్తూ ఆమ్మవారిని దర్శించుకున్న తర్వాత విందు చేసుకుంటున్నారు. అలా భక్తులు ఆదమరవగానే కోతులు వస్తువులు ఎత్తకెళ్తున్నాయి. జాతరలో కూల్‌డ్రిక్స్‌ను తీసుకెళ్లి తాగుతున్నాయి. కూల్‌డింక్స్ తాగుతున్న కోతులను భక్తులు ఆసక్తిగా చూస్తూ ఆశ్చర్యానికి గురవుతున్నారు.

పాపన్న జయంతిని నిర్వహించాలి

వడ్డెపల్లి, ఆగస్టు 16: సర్వాయిపాపన్న గౌడ్ జయంతిని ఈనెల 18న నిర్వహించాలని సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ రాష్ట్ర ఉత్సవ కమిటీ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే సర్దార్‌సర్వాయి పాపన్న గౌడ్ జయంతికి ఉమ్మడి జిల్లాలోని గౌడ, బీసీ, ఎస్సీ, ఎస్టీ నేతలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఫిర్యాదుదారులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలి

ప్రజల భద్రతతో పాటు మన భద్రత ముఖ్యం : మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

మహబూబాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదుదారులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి ప్రశాంతతమైన వాతావరణం కల్పించాలని, ప్రజల భద్రతతో పాటు పోలీసుల భద్రత ముఖ్యమని మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఐజీకి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ మొక్కను అందించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలోని శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుల పనితీరును, నిషేధిత మావోయిస్టు కదలికల పట్ల ప్రస్తుత స్థితిగతులను, జిల్లా శాంతిభద్రతల యొక్క స్థితిగతులను ఎస్పీను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసులు, అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మావోయిస్టు సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా వారిని నివారించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నూతన చట్టాలపై అందరు అవగాహన కలిగి ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్క రించాలన్నారు. కన్విక్షన్ రేట్‌ను పెంచాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణాను అరికట్టడంలో జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 5ఎస్ అమల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌లలోని రికార్డులను, ఫైల్‌ను క్రమపద్ధతిలో అమర్చు కోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రతీ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధం గా చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు నిత్యం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్‌ప్రతాప్, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, రూరల్ సీఐ సర్వయ్య, ఆర్‌ఎస్సైలు, ఎస్సైలు పాల్గొన్నారు.

తాత కర్మకాండకు వెళ్లివస్తూ..

- బైక్ అదుపుతప్పి మనవడి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- నర్సింహులపేట మండలంలో ఘటన


మృతుడు కుర్ర శ్రీకాంత్


ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుర్ర రాజశేఖర్, పద్మ

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 16 : తాత కర్మకాండకు వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో మనువడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం నర్సింహులపేట మండలం వంతడుపుల స్టేజీ వద్ద చోటు చేసుకుంది. ఎస్సై ఎం.సురేష్ తెలిపిన కథనం ప్రకారం. కురవి మండలం సూదనపల్లికి చెందిన కుర్ర వెంకటేశ్వర్లు, సైదమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. ఆర్థికంగా బాగాలేకపోవడంతో వారు 12 ఏళ్లుగా తొర్రూరులో నివాసం ఉంటూ పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వెంకటేశ్వర్లు తండ్రి కుర్ర వీరయ్య ఈనెల 12న సూదనపల్లిలో మృతి చెందాడు. శుక్రవారం తాత ఐదోరోజు కర్మకాండకు మనుమడు కుర్ర రాజశేఖర్, కుర్ర శ్రీకాంత్ (23), అత్త ఎనగందుల పద్మ హాజరై.. తొర్రూరుకు ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నారు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వంతడుపుల స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించపోగా, అదుపుతప్పి ముళ్లపొద్దలోకి దూసుకెళ్లి పల్టీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, 108 వాహనంలో స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా శ్రీకాంత్ మృతి చెందాడు. అన్న రాజశేఖర్, అత్త పద్మకు తీవ్రగాయాలైన్ల తెలిపారు. మృతుడి పెద్దనాన్న సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఇప్పటికే తాత మృతితో బాధలో ఉన్న కుటుంబంలో మనుమడు శ్రీకాంత్ మృతి చెందడంతో సూదనపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భారత్ సేవా పురస్కార్ అందుకున్న అడ్లూరు


కలెక్టర్ ప్రావీణ్య నుంచి అవార్డును అందుకుంటున్న డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తి

హనుమకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణిత అవధాని, రిటైర్డ్ గణిత అధ్యాపకుడు డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తి శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య నుంచి ప్రతిష్ఠాత్మకమైన భారత సేవా పురస్కార్ అవార్డును అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా గణిత రంగంలో చేసిన విశేషమైన సేవలకు గుర్తింపుగా బెంగుళూరుకు చెందిన వెయిల్ ఫౌండేషన్ ఇండియా డాక్టర్ అడ్లూరును భారత సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డు కింద వెయిల్ ఫౌండేషన్ ఇండియా పంపిన ట్రోఫీ, ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా డాక్టర్ నర్సింహమూర్తి స్వీకరించారు.

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉత్తర్వులు బేఖాతరు

లెక్క చేయని పైడిపల్లి మెడికల్ ఆఫీసర్, ఫార్మసిస్టు

వరంగల్ మెడికల్, ఆగస్టు 16: వైద్య, ఆరోగ్యశాఖలో ఇటీవల జరిగిన బదిలీలలో ఎంజీఎం ఆస్పత్రిలో పనిచేస్తున్న ఫార్మసిస్టు సుచరితకు పీహెచ్‌సీ పైడిపల్లికి పోస్టింగ్స్ ఇచ్చారు. ప్రభుత్వ జీవో నెంబర్ 80 ప్రకారం ఫోకల్ నుంచి ఫోకల్‌కు ఎవరికీ పోస్టింగ్ ఇవ్వరాదు. సుచరితకు జీవోకు విరుద్ధంగా పైడిపల్లికి ట్రాన్స్‌ఫర్ చేయగా, కొందరు ఫార్మసిస్టులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సుచరితను వెంటనే పైడిపల్లి నుంచి మరిపెడ పీహెచ్‌సీకి ట్రాన్స్‌ఫర్ చేస్తూ జూలై 31న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. ఉత్తర్వుల ప్రకారం ఫార్మసిస్టును మరిపెడకు పంపించాలి కానీ డైరెక్టర్ ఉత్తర్వులను మెడికల్ ఆఫీసర్ సైతం లెక్కచేయకుండా ఇంకా పైడిపల్లిలోనే ఉంచారు. విషయం తెలుసుకున్న వరంగల్ డీఎంహెచ్‌వో కె.వెంకటరమణ.. ఫార్మసిస్టును మరిపెడకు పంపించాలని మెడికల్ ఆఫీసర్‌కు మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. అయినా కూడా ఫార్మసిస్టును విధుల్లో కొనసాగిస్తున్న మెడికల్ ఆఫీసర్‌పై విచారణ జరిపించి, క్రమ శిక్షణ చర్యలు తీసుకొని ఫార్మసిస్టు సుచరితను వెంటనే మరిపెడకు పంపించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



శ్రీ రాధాకృష్ణ గీతా మందిర్‌లో మహిళల పూజలు



చిట్యాల పెద్దమ్మతల్లి ఆలయంలో వరలక్ష్మీ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



ఆలయంలో పూజల్లో పాల్గొన్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి దంపతులు

కాటారం, ఆగస్టు 16: మండలంలో వరలక్ష్మీశుక్రవారం వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రావణమాసంలో రెండో శుక్రవారాన్ని వరలక్ష్మి శుక్రవారంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. మండలకేంద్రంలోని పలు ఆలయాల్లో, మహిళలు తమ ఇళ్లల్లో కుంకు మార్చనలు, సామూహిక వరలక్ష్మీ వ్రతం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శ్రీరాంభట్ల కృష్ణమోహన్‌శర్మ, పనకంటి ప్రవీణ్‌శర్మ, వేదాంతం గణేష్‌శర్మ, లక్ష్మీకాంత్‌శర్మ, రాంమూర్తిశర్మ వరలక్ష్మి శుక్రవారాన్ని పురస్కరించుకుని పూజలు జరిపారు.

● భూపాలపల్లిటౌన్ : వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు ఇళ్లలోనే వ్రతాలు చేసుకోగా ఎక్కువ మంది ఆలయాల్లో చేశారు. పట్టణంలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయం, శ్రీసీతారామాం జనేయ స్వామి ఆలయం, శివాలయం, శ్రీచతుర్రూప అయ్యప్ప స్వామి ఆలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ సద్గురు గీతా రాధాకృష్ణ మందిర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఘనంగా వ్రతాలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరావు స్వామిజీ, ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు గూడూరు నరేందర్‌రెడ్డి, పల్లెర్ల లలిత , భక్తులు పాల్గొన్నారు.

● చిట్యాల : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శుక్రవారం మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు అమ్మవార్ల ఆలయానికి చేరుకుని అభిషేకం, కుంకుమ పూజలు జరిపించారు.

● మహదేవపూర్ : కాళేశ్వరం గ్రామస్తులు, భక్తులు 75 మంది మహిళలు పాల్గొని వరలక్ష్మీ వ్రతం పూజాతంతును నిర్వహించారు పూజలో పాల్గొన్న మహిళా భక్తులకు పూజా సామగ్రి, నైవేద్యం ప్రసాదం దేవస్థానం తరఫున అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా మహదేవపూర్‌లోని శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు విశ్వ హిందూ పరిషత్ మహదేవపూర్ ప్రకండ ఆధ్వర్యంలో జరిగాయి.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్ల వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం విశ్వహిందు పరిషత్ మండల అధ్యక్షుడు ఒల్లాల రమేష్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. తాడిచర్లలోని అభయాంజనేయ స్వామి, మల్లారంలోని శివపంచాయతన హనుమాన్ దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్ శర్మ మహిళలతో వ్రతాలు నిర్వహింపజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందుపరిషత్ సభ్యులు, గ్రామస్తులు ఓజల రాజబాబు, యెల్లారి శ్రీనివాస్, మధుసూదన్‌రావు, కోట నవీన్, ధన్నపునేని అశోక్‌రావు, తిర్రి అశోక్, మల్క మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

● వెంకటాపూర్(రామప్ప) :వరాలిచ్చే మహాలక్ష్మి మమ్మల్ని చల్లగా చూసి వరాలు ఇవ్వమని వేడుకుంటూ మహిళలు శుక్రవారం వరలక్ష్మీకి పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబ రఘునాథచార్యులు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నరెడ్ల భాస్కర్, వర్తకసంఘం సభ్యులు పాల్గొన్నారు.



సీతారామాంజనేయస్వామి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : ఎమ్మెల్యే గండ్ర



మంజూర్‌నగర్ బీసీ కాలనీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 16: భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ కాలనీలో, కారల్‌మార్క్స్‌కాలనీలలో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ అభివృద్ధే తన లక్ష్యమని, మునుపెన్నడూ లేని విధంగా ప్రజా అవసరాలను గుర్తించి వారికి అందుబాటులో ఉంటూ అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, కౌన్సిలర్లు రేణుక, ముంజాల రవీందర్, అనిల్, రవీందర్, రజిత, నాయకులు బుర్ర కొంరయ్య, అంబాల శ్రీనివాస్, దాట్ల శ్రీనివాస్, రంజిత్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే పదోన్నతులు చేపట్టాలి

ఐటీడీఏ పీవోకు వినతి పత్రం అందజేత

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 16: నిబంధనలకు విరుద్ధంగా గిరిజన సంక్షేమశాఖలో చేపడుతున్న ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియను నిబంధనల మేరకే చేపట్టాలని గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైద్య సురేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పదోన్నతుల ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని కోరుతూ టీడబ్ల్యూటీయూ, యూటీఎఫ్, టీఆర్‌టీఎఫ్, ఏటీఎఫ్ గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ల పదోన్నతుల విషయంలో అధికారులు అనాలోచిత నిర్ణయాల వలన వారికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆయన ఆరోపించారు. 30శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా చేపట్టాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నప్పటీ కిని వాటిని పట్టించుకోకుండా అధికారులు ఇష్టానుసారంగా చేపడుతున్నారని ఆయన తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఆప్షన్‌పెట్టుకున్న ప్రతీ ఒక్కరికి అర్హత మేరకు పదోన్నతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధరావత్‌రాజు, కొక్కెర రమేష్, కృష్ణ ప్రసాద్, జబ్బ రవి, సంతోష్, బానోతు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏలో పీవో చిత్రామిశ్రాకు వినతి పత్రం అందిస్తున్న గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూత

కాటారం, ఆగస్టు 16: బైక్‌పై వెళ్తూ గొర్రెలు అడ్డుగా రావడంతో అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన వ్యక్తిని నైట్ డ్యూటీలో ఉన్న కాటారం సీఐ నాగార్జునరావు స్వయంగా ఆస్పత్రికి తరలించి ఆదుకున్నారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి 353(సీ)జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి కాటారం వైపు నుంచి మహదేవపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా అకస్మాత్తుగా గొర్రెలు రోడ్డుపైకి రావడంతో వాటిని ఢీకొని కిందపడ్డాడు. అదే సమయంలో జిల్లాలో నైట్ వాచ్ డ్యూటీలో ఉన్న సీఐ నాగార్జునరావు విధి నిర్వహణలో భాగంగా అటువైపు వెళ్త క్షతగాత్రుడిని గమనించాడు. వెంటనే తన వాహనంలో మహదేవపూర్ పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు. విషయం తెలిసి ఆస్పత్రికి వచ్చిన బాధితుడి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

చర్చనీయాంశంగా డ్రైవర్ల బదిలీలు

కాకతీయఖని, ఆగస్టు 16: జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీశాఖ పరిధిలోని భూపాలపల్లి డివిజన్‌లో ఇటీవల జరిగిన ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల బదిలీలు చర్చనీయంశంగా మారింది. ఈ నెల 13న ఇద్దరు ఔట్ సోర్సింగ్ డ్రైవర్లను బదిలీ చేస్తూ డీఎఫ్‌వో వసంత ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఒక డ్రైవర్ బదిలీ చేసిన స్థానానికి వెల్లకుండా యథాస్థానంలో ఉండేందుకు అటవీ శాఖలో పనిచేస్తున్న ఓ అధికారికి రూ.30వేలు ఇచ్చినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. దీంతో సదరు డ్రైవర్ తన సొంత స్థానంలోనే పనిచేస్తున్నాడని గుసగుసలాడుకుంటున్నారు. ఈ విషయమై డీఎఫ్‌వో వసంతను వివరణ కోరగా ఇద్దరు డ్రైవర్లను బదిలీ చేస్తూ ఆర్డర్ ఇచ్చినమాట వాస్తవమేనని అన్నారు. ఆర్డర్ ఇచ్చాక ఇంప్లిమెంట్ చేయాల్సిందేనన్నారు. డ్రైవర్లు రేంజ్ ఆఫీసర్ల పరిధిలో పనిచేస్తారని తెలిపారు. లాండ్, ఫారెస్ట్ ప్రొటెక్షన్ అంశంలో అధికారుల మూమెంట్ ఇన్‌ఫర్మేషన్‌ను పోడు చేసే వారికి లీక్ చేయకుండా డ్రైవర్లను చేంజ్‌సేస్తుంటామన్నారు. డ్రైవర్స్ లోకల్ ఏరియాలకు సంబంధించిన వారుకాబట్టి ఏరియాకు కాస్త దూరం చేస్తుంటామన్నారు. అందులో భాగంగానే ఇంటర్నల్ అడ్జెస్ట్‌మెంట్ చేశామన్నారు. ఈ క్రమంలో ఇద్దరు డ్రైవర్లు తన వద్దకు వచ్చి మమ్మల్ని బదిలీ చేయొద్దని, చిన్న పిల్లలున్నారు. స్కూల్‌కు వెళ్తున్నారని చెప్పారన్నారు. ముందు వెళ్లి బదిలీ చేసిన స్థానంలో జాయిన్ కావాలని ఆదేశించినట్లు తెలిపారు. డబ్బులు ఇచ్చారనడం అవాస్తవమని చెప్పారు.

కాళేశ్వరంలో జిల్లా జడ్జి పూజలు

మహదేవపూర్, ఆగస్టు 16 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్జి నారాయణబాబు కుటుంబసభ్యులతో శుక్రవారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు రాజగోపురం నుండి పూర్ణకుంభస్వాగతం పలికి స్వామివారికి అభిషేకం,అ మ్మవారి ఆలయంలో దర్శనం చేయించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ జడ్జికి స్వామివారి శేష వస్త్రాలు అందజేశారు. వేద పండితులు, అర్చక స్వాములు జడ్జి దంపతులకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాళేశ్వరం ఎస్సై చక్రపాణి, మహా ముత్తారం ఎస్సై మహేందర్, మహదేవపూర్ ఎస్సై పవన్ పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



ములుగులోని జాతీయ రహదారిపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 16: మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ములుగులోని 163వ జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ కేటీఆర్‌కు అధికారం పోయినా అహం మాత్రం తగ్గలేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తే ఓర్వని బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన ఎనిమిది నెలలుగా పేద ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని, ఇచ్చిన మాట ప్రకారం మూడు దఫాలుగా రూ.2లక్షల రైతురుణమాఫీ చేసిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంటికి 200యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

కాటారం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిళలకు భేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ మహిళా కార్యదర్శి ఆంగోత్ సుగుణ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కేటీఆర్ అహంకారానికి తగినశాస్తి చేసిన బుద్ధి రాలేదని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అవాకులు చెవాకులు పేలడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో గౌరక్క, బెడికె లక్ష్మి, డోంగిరి లక్ష్మి తదితరులు ఉన్నారు.

పాపన్న జయంత్యుత్సవాలకు హాజరుకావాలి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 16: సర్ధార్ సర్వాయి పాపన్న 374వ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని గౌడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ టీఎస్.దివాకరను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈసందర్భంగా భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్ధార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం గర్వించతగ్గ విషయమని అన్నారు. ములుగులో జరిగే సర్ధార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలకు జిల్లాలోని గీతకార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

వైద్యాధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 16: ఏజెన్సీ ప్రాంతాల్లోని వైద్యాధికారులు, సిబ్బంది అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం ఆయన మండలంలో పర్యటించారు. ముందుగా ఆయన మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి పరిసరాలు, వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు క్లోరినేషన్, బ్లీచింగ్, డ్రైనేజీ పూడికతీత, తదితర కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి వేణును ఆదేశించారు. వైద్యాధికారులు, వివిధశాఖల అధికారులు ఉన్నారు.

జనగలంచలో..

తాడ్వాయి : మండలంలోని జనగలంచ గొత్తికోయగూడాన్ని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గొత్తికోయల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేదని, తమకున్న రెండెకరాల చొప్పున ఉన్న పోడుభూములను ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారని, దీంతో కూలీ పనులకు వెళుతూ జీవనోపాధి పొందుతున్నామని గొత్తికోయలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ఆర్డీ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సీపీఎం నాయకులు, ఆర్డీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



జనగలంచలో గొత్తికోయల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ దివాకర

ఫార్మసిస్టుల ద్వారానే మందులు విక్రయించాలి

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 16: ఫార్మసి చట్టం, ఔషధ విక్రయ చట్టం ప్రకారం మెడికల్‌షాపుల్లో ఫార్మసిస్టుల ద్వారా మాత్రమే మందులు విక్రయించాలని ఇండియన్ ఫార్మసిస్టు అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కృష్ణ శుక్రవారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలేనివారితో మందులు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డ్రగ్స్ కంట్రోల్ అధికారులను ప్రకనటలో కోరారు.

'కేటీఆర్ అహంకారపు మాటలు సిగ్గుచేటు'

చిట్యాల, ఆగస్టు 16: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మహిళల పట్ల అహంకారపూరితంగా మాట్లాడడం సిగ్గుచేటని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంపై రాష్ట్రంలోని అన్ని వర్గాల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

ఫర్టిలైజర్ డీలర్స్ అధ్యక్షుడిగా సాగర్‌రావు



సాగర్‌రావు

మల్హర్, ఆగస్టు 16 : మండలంలోని కొయ్యూర్‌లో శుక్రవారం మండల ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా తాడిచర్ల గ్రామానికి చెందిన పమ్మిడి సాగర్‌రావు రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా తాళ్ల రాజేందర్, కోశాధికారి అల్లాడి సురేష్, ప్రధాన కార్యదర్శి బొమ్మ రమేష్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు పగడాల గట్టయ్య, తొగరి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నర్సయ్య



నర్సయ్య

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 16: రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని శుక్రవారం జిల్లా అధ్యక్షుడు జన్ను రవి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా కనుకుంట్ల నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా సోమిడి కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ రమ, కార్యదర్శిగా కడియాల విజయ శ్రీ-దేవేందర్‌లు ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు బండ భాస్కర్, నాయకులు గువ్వ రామస్వామి, దయ్యం మధునమ్మ, సతీ ష్, సాంబయ్య, ఐలుమల్లు, వెంకటస్వామి, రాజయ్య పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి రిమాండ్

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు16: భూమి మీద ఆశతో ముగ్గురు వ్యక్తులు కలిసి ఓ వ్యక్తిని మర్డర్ చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం రి మాండ్ చేశారు. స్థానిక ఎస్సై తాజుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... మండలకేంద్రానికి చెందిన గావిడి రాములుకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. రాములు అన్న కూతురు ఎడం సారమ్మ, ఈమె కుమారుడు శివనాగరాజు, సారమ్మ పిన్నికూతరు సరితలు మూడెకరాల భూమిపై కన్నేశారు. కాగా ఈ నెల 4వ తేదీన రాములు తాగి వచ్చి ముగ్గురితో గొడవ పెట్టుకున్నాడు. ఇదే అదునుగా చూసిన ఎడం సారమ్మ, సరిత, శివనాగరాజులు అతడిపై కర్రలతో దాడికి పాల్పడ్డారని ఎస్సై తెలిపారు. ఈ దాడిలో రాములుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే మం డల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్న రాములు(65) పరిస్థితి విషమించి ఈ నెల 10 తేదీన మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడి రెండో అన్న కూతురు సోమలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు. విచారణలో భూమిని కాజేసేందుకు రాములును ముగ్గురు కలిసి ఉద్దేశ పూర్వకంగా చంపినట్లు దర్యాప్తులో తెలిసిందని, ముగ్గురు నిందుతులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై స్పష్టం చేశారు.

వైద్య కోర్సులపై ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 16: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జూలై 19న జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో 9, 10తరగతులతోపాటు ఇంటర్మీడియట్ స్థానికంగా చదివి ఉండాలని ఉత్తర్వులో పేర్కొనడం సరైందికాదని, నిబంధనల ప్రకారం తెలంగాణ విద్యార్థులు నాన్ లోకల్ విద్యార్థులవుతున్నారని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చిట్యాల, ఆగస్టు 16: మండలంలోని నైన్‌పాక శివారులో కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. టేకుమట్ల మండలం రామకృష్ణాపురం (వీ) గ్రామానికి చెందిన సాండేసరి రాయమల్లు ఇటీవల మృతి చెందాడు. హస్తికలను త్రివేణి సంగమంలో కలిపేందుకు గురువారం మృతుడి కుటుంబ సభ్యులు కాళేశ్వరం వెళ్లారు. శుక్రవారం ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో నైన్‌పాక శివారులో కారు అదుపుతప్పి రోడ్డు కింతకు దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో సాండేసరి రమేష్ తీవ్రంగా గాయపడగా, అతడి తల్లి వీరక్క, ఇద్దరు కుమారులు నందు, శ్రీనాథ్ స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన వాహనదారులు 108 సహాయంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం, క్షతగాత్రుల వివరాలు సేకరించారు.

మండలంలో భారీ వర్షం

మల్హర్, ఆగస్టు 16 : మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగ పత్తి, వరి చేన్లలోకి వరద నీరు వచ్చి చేరింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండతో పాటు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి కాగా వర్షం కురియడం ఉపశమనం కల్గించింది. ఎండ, భారీ వర్షం లేక పోవడం పత్తి రైతులు ఆందోళన చెందారు. భారీ వర్షం వల్ల పత్తి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పీసీసీ ఓబీసీ సెల్ స్టేట్ కో ఆర్డినేటర్‌గా దామోదర్‌గౌడ్

రేగొండ, ఆగస్టు 16: పీసీసీ ఓబీసీ సెల్ స్టేట్ కోఆర్డినేటర్‌గా తాళ్ళపల్లి దామోదర్ గౌడ్‌ను నియమిస్తూ శుక్రవారం పీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నుమాతి శ్రీకాంత్‌గౌడ్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. మండలంలోని భాగిర్తిపేట గ్రామానికి చెందిన దామోదర్‌గౌడ్ సినీ నటులుగా, దర్శకులుగా పని చేశారు. ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఓబీసీ రాష్ట్ర చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి అదృశ్యం

ములుగు, ఆగస్టు 16: జిల్లాకేంద్రానికి చెందిన ఎమ్డీ.జావీద్(28) అదృశ్యమైనట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మే 10వతేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కొడుకు తిరిగి రాలేదని ఆయన తండ్రి జాహెద్ జూన్ 22న ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

రేగులగూడెం ఏఈవోగా ఆస్మా

కాటారం, ఆగస్టు 16:మండలంలోని రేగులగూడెం వ్యవసాయ క్లస్టర్ ఏఈవోగా మహ్మద్ ఆస్మా బదిలీపై వచ్చారు. మహాముత్తారంలోని బోర్లగూడెం క్లస్టర్ ఏఈవోగా ఉన్న ఆస్మాను రేగులగూడెంకు బదిలీ చేస్తూ ఏడీ ఉత్తర్వులు జారీ చేశారు.

సేఫ్టీ మోకులు అందించాలని గీతకార్మికుల బైక్ ర్యాలీ

తాడ్వాయి, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్రంలోని గీతకార్మికులందరికీ సేఫ్టీ మోకులు అందించాలని కోరుతూ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి చిననర్సయ్య ఆధ్వర్యంలో గీతకార్మికులు శుక్రవారం మండలంలోని కాటాపూర్, గంగారం, బీరెల్లి గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. తమకు సేఫ్టీ మోకులు అందించాలని డిమాండ్ చేశారు. కాటాపూర్, గంగారం, బీరెల్లి గ్రామాల గీతకార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కాటారం, ఆగస్టు 16:మండలంలోని ఎర్రగుంటపల్లిలో ఇటీవల చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన మొగిలి గట్టయ్య కుటుంబానికి యాదవసంఘం నేతలు చేయూతనందించారు. శుక్రవారం యాదవసంఘం నేతలు గట్టయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు తొట్ల శ్రీశైలం, నాయకులు సత్యం, వెంకటస్వామి, సంతోష్, కొమురయ్య, మొగిలి, చంద్రశేఖర్, మహేందర్, తిరుపతి తదితరులు ఉన్నారు.

మొదలైన చెట్ల లెక్కింపు సర్వే

మహదేవపూర్, ఆగస్టు 16 : గత నాలుగేళ్ల క్రితం 353 జాతీయ రహదారి అభివృద్ధి కోసం రూ. 137 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిధులు మంజూరైనా ఇన్నాళ్లు అటవీశాఖ అధికారుల నుంచి క్లియరెన్స్ రాక , ఇంకా పలు సమస్యలతో పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా శుక్రవారం అటవీశాఖ నుంచి క్లియరన్స్ రావడంతో అటవీశాఖ అధికారులు చెట్ల లెక్కింపు సర్వే నిర్వహించారు. రహదారి ద్వారా ఎన్ని మొక్కలు , చెట్లు నష్టపోతున్నారో అటవీ శాఖ సిబ్బంది లెక్కింపు చేస్తోంది. ఈ సర్వే పూర్తయిన వెంటనే రహదారి పనులు ప్రారంభం కానున్నాయి.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 16 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం బ్యారేజీలోకి 1.57లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 2.80మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది. అన్నారం బ్యారేజీకి 2500క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు.